పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో చాపరాయి జలపాతం పర్యాటకులతో కిటకిటలాడింది. మైదాన ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వాహనాల్లో తరలి రావడంతో జలపాతంలో వాహనాల రద్దీ ఏర్పడింది. ఇక్కడికి సందర్శించిన పర్యాటకులు సరదాగా జలపాతంలో జారుకుంటూ స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. కుటుంబ సమేతంగా రోడ్డు కిరువైపులా వనభోజనాలు చేస్తూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. రోడ్డు కిరువైపులనున్న పూల తోటల్లో పర్యాటకులు ఫోటోలు తీసుకుంటూ సందడి చేశారు.

జలపాతం వద్ద పర్యాటకులు

సమ్మెకు సన్నద్ధం

-3 మాసాల నుంచి దశల వారీ ఆందోళన
- స్పందించని ప్రభుత్వం
- పోరుబాటలో సమగ్ర శిక్ష ఉద్యోగులు

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష -పాఠశాల విద్యాశాఖలో పని చేస్తున్న వివిధ కేటగిరి ల ఉద్యోగులు డిసెంబర్ 20 నుంచి సమ్మెకు సన్నద్ధమవుతున్నారు. సుమారు 12 ఏళ్ల నుంచి విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం గత కొన్నాళ్లుగా ఆందోళన బాట పట్టారు. సెప్టెంబర్ 10న ఐటీడీఏ ఎదుట వేడుకోలు దీక్ష, 22న నల్ల బ్యాడ్జీలతో నిరసన, 25న విజయవాడలో సత్యాగ్రహ దీక్ష, అక్టోబర్ 2న మహాత్మా గాంధీ విగ్రహాల వద్ద వినతి పత్రాలతో నిరసన, 5న నల్ల బ్యాడ్జీలతోనూ, 18న ఖాళీ వంట పాత్రలతో నిరసన, ఈ విధంగా దశల వారి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా సర్వీస్ రెగ్యులరైజేషన్, మినిమం టైం స్కేల్ అమలు, ఉద్యోగ భద్రత కోసం పోరు సాగిస్తున్నారు.

ఆందోళన చేస్తున్న సర్వశిక్ష ఉద్యోగులు (ఫైల్ ఫొటో)

మండల ఎం.ఐ.ఎస్ కోఆర్డినేటర్స్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్స్, ఐ.ఈ. కోఆర్డినేటర్స్, కస్తూర్బా గాంధీ బాలికల టీచింగ్ అండ్ నాన్ టీచింగ్, ఐఆర్‌టి ఆయాస్, మెసెంజర్స్ తదితర ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్ చేయాలనీ కోరుతున్నారు. అల్లూరి జిల్లాలో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న 862 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకుంటే డిసెంబర్ 20వ తేది నుండి నిరవధిక సమ్మెలో పాల్గొనేందుకు వీరంతా సన్నద్ధమై జిల్లా విద్యాశాఖ అధికారులకు 24న శనివారం సమ్మె నోటీసు అందజేశారు. ముందుగా తమ ఆందోళనలో భాగంగా డిసెంబర్ 11న చలో విజయవాడ కార్యక్రమంతో ప్రభుత్వానికి మరోసారి విన్నవించి సమస్యల పరిష్కరించకుంటే సమ్మెలులో దిగేందుకు సమగ్ర శిక్ష ఉద్యోగులు నిర్ణయించారు.విద్యాశాఖ పరిధిలో పని చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వాపోతున్నారు. పిఆర్సి అమలు చేయకుండా, నెలలు తరబడి వేతనాలు విడుదల చేయకపోవడం దుర్మార్గమనీ ఆవేదన చెందుతున్నారు. స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటన చేసిన మినిమం ఆఫ్ టైమ్ స్కేల్ పై జీఓలు ఇచ్చి, అమలు చేయలేదని నిరసిస్తున్నారు. త్వరలో ఎంటిఎస్ అమలు చేస్తున్నామని శాసన మండలిలో ప్రభుత్వం, విద్యాశాఖా మంత్రి లిఖితపుర్వంగా హామీ ఇచ్చి మూడేళ్ళు గడిచినా ప్రభుత్వం ఎంటిఎస్ అమలు చేయలేదని, కొన్ని విభాగాలకు, కెజిబివి టీచర్లకు అరకొర జీతాలు పెంచి చేతులు దులుపుకున్నారని వాపోతున్నారు. సమగ్ర శిక్షలో ఒకే క్యాడర్ ఉద్యోగులకు రకరకాల వేతనాలు చెల్లిస్తూ, కొత్త విధానాలకు ధర లేపారని. పాత వారికి జీతం పెంచకుండా, కొత్తగా నియమితమైన వారికి జీతం పెంచే కొత్త విధానాలకు ప్రభుత్వం తెర తీసిందని వారు తెలిపారు. పార్ట్ టైం పేరుతో తక్కువ జీతాలు ఇచ్చే విధానాలను అమలు చేస్తున్నారని, ఎన్నికల కంటే ముందు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు, అన్ని విధాలుగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగుల కుటుంబాలను ఆదుకుంటామని చెప్పి, ఒక్క సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం చూపలేదని సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు:

సమగ్ర శిక్షా ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను తక్షణమే రెగ్యులర్ చేయాలి. ప్రతి నెల ఒకటి తేదికి వేతనాలు చెల్లించాలి. వేతనాలు కోసం సంవత్సరానికి సరిపడే బడ్జెట్ ఒకేసారి విడుదల చేయాలి. సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులకు కేడర్‌ని బట్టి వేతనాలు వెంటనే పెంచాలి. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. అందరికి మినిమం ఆఫ్ టైం స్కేల్ హెచ్‌ఆర్‌ఏ, డిఎ, అమలు చేసి, వేతనాలు పెంచాలి. పెండింగ్ లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలి. ఔట్సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోని మార్చి మినియం ఆఫ్ టైం స్కేల్ అమలు చేసి, వేతనాలు పెంచాలి.ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దు చేసి, ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేసి వేతనాలు పెంచాలి.10 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్ గ్రాట్యుడి కల్పించాలి. సామజిక భద్రత పథకాలు, ఈపీఎఫ్ ఈఎస్ఐ అమలు చేయాలి. పదవి విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలి.వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలి. మెరుగైన హెల్త్ స్కీం అమలు చేయాలి. సి.ఆర్.ఎం.టి లు డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఎం.ఐ. ఎస్ కోర్డినేటర్స్, మండల లెవెల్ అకౌంటెంట్స్, మెసెంజర్స్, ఆర్ట్, క్రాఫ్ట్, పి.ఈ.టి, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి. పని భారం తగ్గించాలి.

హామీల అమలేదీ?

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించింది. మినిమం టైం స్కేల్ ఇస్తామని చెప్పి అమలు చేయలేదు. సీఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు పాదయాత్రలో తాము కలిసినప్పుడు సమగ్ర శిక్ష ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం హామీ ఇచ్చి నెరవేర్చలేదు. తమకు ప్రభుత్వం సక్రమంగా జీతాలు చెల్లించడం లేదు. నాలుగు నెలలకు ఒకసారి ఒక నెల జీతం ఇస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో జీతాలందని పరిస్థితుల్లో 8 మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు మృతి చెందారు. కేంద్ర ప్రభుత్వం తమ జీతభత్యాలను విడుదల చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్ళిస్తోంది.

వి. జయరాజ్
జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపీ సర్వ శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

సిఐటియు రంపచోడవరం జిల్లా నాయకులు రామరాజుకు నోటీసు ఇస్తున్న పోలీసు

సిఐటియు నేతల గృహ నిర్బంధం

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు : జిల్లా నేతలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : కేంద్ర కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు ఈనెల 27, 28 తేదీల్లో అమరావతిలో చేపడుతున్న మహాధర్నాకు బయలుదేరుతున్న సిఐటియు జిల్లా నాయకులు పి.రామరాజు, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు కె.వెంకటలక్ష్మి, మండల నాయకులు చిన్ని కుమారి తదితరులను పోలీసులు ఆదివారం రాత్రి నోటీసులు జారీ చేసి గృహ నిర్బంధం చేశారు. మహాధర్నాకు ఎటువంటి అనుమతులు లేవని, నాయకులు వెళ్లరాదని ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికై శాంతియుతంగా ధర్నాలు, ఆందోళనలు చేస్తున్న కార్మికులపై పోలీసులు నిర్బంధం ప్రయోగించడం దుర్మార్గమన్నారు. అక్రమ అరెస్టులు, నిర్బంధంతో ఉద్యమాలను ఆపలేరని రామరాజు స్పష్టం చేశారు.

నిర్బంధం దుర్మార్గం : సిఐటియు నేత వెంకట్

రంపచోడవరం : శాంతియుత ఆందోళనకు బయలుదేరిన సిఐటియు, అనుబంధ సంఘాల నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేయడం దుర్మార్గమని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా కార్మికులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, కార్మికుల పట్ల ప్రభుత్వ తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రానున్న ఎన్నికల్లో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

ప్రజా ఉద్యమాలపై నిర్బంధం తగదు : ఉమా, చిన్నయ్యపడాల్

అరకులోయ రూరల్ : మహాధర్నా కార్యక్రమానికి సన్నద్ధం అవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పాడేరు, పెదబయలు, అరకు ప్రాంతాల్లో సిఐటియు నాయకులను గృహ నిర్బంధాలు చేయడం తగదని సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్పి పోతురాజు, జి.భగత్ రాం తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర మోడీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా మహా ధర్నా జరుగుతోందని, రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని, దీనిని అడ్డుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రయత్నం చేస్తుందని, కార్మికులు విజయవాడ రాకుండా అడ్డుకోవడం దారుణమన్నారు.

చింతపల్లి: విజయవాడలో కార్మిక కర్షక రైతుల మహా ధర్నాకు వెళ్లనివ్వకుండా కార్మిక సంఘాల నాయకులను గృహ నిర్బంధాలు చేయడం తగదని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్ మండిపడ్డారు. చింతపల్లి మండలం లంబసింగి గ్రామంలో ఆదివారం సిఐటియు జికె వీధి మండల కార్యదర్శి సత్యనారాయణతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను హక్కులను తుంగలోకి తొక్కుతుంటే కాపాడవలసిన రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పాదంతో అణచి వేస్తోందని మండిపడ్డారు. 11 మండలాలలో సిఐటియు నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేసినా, ఇళ్లకు పోలీసులను పంపించి నిర్బంధించినా వారి నుంచి తప్పించుకొని మహాధర్నాకు వెళ్లినట్లు తెలిపారు.

పార్టీ మార్పుపై ప్రచారం అవాస్తవం

-టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు దొన్నుదొర

ప్రజాశక్తి -అరకులోయరూరల్: తన ఎదుగు దలను చూసి ఓర్వలేక కొందరు పార్టీ మారుతున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని, టిడిపికి నమ్మక ద్రోహం చేయనని, ఆ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల దృష్టిలో పెట్టుకొని దొన్నుదొర వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారనే ప్రచారం నేపథ్యంలో ఆదివారం ఆయన ఇంటి వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీడీపీ పార్టీ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులుగా నియమించిందని, ఈ గౌరవాన్ని తాను ఎప్పటికీ మర్చిపోనన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తానని తెలిపారు.పార్టీ మారే ఆలోచన లేదని స్పష్టం చేశారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి గిరిజనులకు అన్యాయం చేస్తూనే ఉందన్నారు. గిరిజనులకు అన్యాయం జరుగుతున్నా చట్టసభల్లో కనీసం నోరు మెదపలేని వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యేలు ఎందుకు అని ఆయన ఎద్దేవా చేశారు. గిరిజన ఉద్యోగాలు గిరిజనులకే దక్కాలని, ఎప్పటినుంచో పోరాటం చేస్తున్న జీవో 3 విషయంలో వైఎస్ఆర్సిపి నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుందని విమర్శించారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించి నవరత్నాల కోసం వినియోగిం చుకుంటూ గిరిజనులను మోసం చేస్తున్న జగన్మోహన్ రెడ్డికి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గిరిజనులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించే బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని రద్దుచేసిన ఈ ప్రభుత్వం గిరిజన విద్యను కుంటుపడేలా చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసు బాబు, మాదల సర్పంచ్ శ్రీనివాసరావు, బొర్రా సర్పంచ్ జన్ని అప్పారావు, ఉప సర్పంచ్ పాడి నిర్మల, ములియపుట్ సూపర్ ఉప సర్పంచ్ కిరసానీ మత్యరాజు, మాజీ ఎంపిటీసీలు లక్ష్మి, కిల్లో కుమార్ బాబురావు, అరకు అసెంబ్లీ అధికార ప్రతినిధి కొర్ర నీరజా లక్ష్మీ, తులవతి ,వార్డు మెంబర్ గంగ, తెదేపా నాయకులు బొడ్డా శ్యామ్ సుందర్, పోతురాజు, చందు, రాము, మహదేవ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దొన్ను దొర

నినాదాలు చేస్తున్న సిహెచ్‌డబ్ల్యులు

సిహెచ్‌డబ్ల్యుల సమస్యలను పరిష్కరించాలి

3వ రోజు కొనసాగిన రిలే దీక్షలు

ప్రజాశక్తి -పాడేరు: తమను ఆశా వర్కర్లుగా మార్చాలని డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ ముందు కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు (సిహెచ్‌డబ్ల్యులు) నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం 3వ రోజు కొనసాగాయి. ఈ రిలే నిరాహార దీక్షలను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.సుందరరావు మాట్లాడుతూ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, సిహెచ్‌డబ్ల్యులకు 4వేలు ఇస్తే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా ఇటువంటి వ్యత్యాసం లేదని అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో 750 మంది కమ్యూనిటీ వర్కర్లకు ఈ వ్యత్యాసం ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి అనేక మార్లు ప్రభుత్వ అధికారులకు, ప్రభుత్వానికి కోరినా కనీసం స్పందించలేదన్నారు. ఇచ్చే వేతనం కూడా ప్రతి నెల చెల్లించ లేదని, ఒకవైపున ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. సిహెచ్‌డబ్ల్యులకు యూనిఫాం, సెల్ ఫోన్లు, మెడికల్ కిట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి వై.మంగమ్మ, ఉపాధ్యక్షులు దాసమ్మ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సంఘం నేతలు కిల్లో పార్వతమ్మ, టి.మోదకొండమ్మ. జె.సావిత్రి, కాంతమ్మ, నాగమణి, చిన్ని, లక్ష్మి పాల్గొన్నారు.

తోటను దగ్ధం చేస్తున్న పోలీసులు

గంజాయి తోట ధ్వంసం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలం కేంద్రంలోని తీగలవలస పంచాయతీ గుర్రాలతోట గ్రామంలో గెడ్డ సమీపంలో రెండు ఎకరాల గంజాయిని ఆదివారం ధ్వంసం చేశామని స్థానిక ఎస్సై సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్క సహకరించాలని కోరారు. దర్యాప్తు చేసి సాగుదారులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తవ్వేసి వదిలేశారు..

కుందులూరు సమీపంలో మెటల్ వేసి వదిలేయడంతో రాళ్లు తేలిపోయి ఉన్న రహదారి

- మూడేళ్లయినా నిర్మాణానికి నోచని పెదమట్టపల్లి - నర్సంగపేట రహదారి
- రాళ్లు తేలిపోయి ప్రయాణం నరకప్రాయం
- వర్షాలు కురిస్తే బురదమయం
- ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని పెదమట్టపల్లి - నర్సంగపేట వరకు రహదారి నిర్మాణానికి అప్పటి వరకు ఉన్న రోడ్డును తవ్వి వదిలేశారు. మూడేళ్లయినా నేటికీ దాని నిర్మాణం చేపట్టలేదు. దీంతో రహదారిపై రాళ్లు తేలిపోయి ప్రయాణం నరకప్రాయంగా ఉండగా, వర్షాలు పడితే ముడుకుల లోతు బురదలో రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. నిధులు లేమితో పంచాయతీలు, మండల ప్రజాపరిషత్ మూలుగుతున్నాయి. ఒకప్పుడు కాంట్రాక్టర్లు ప్రభుత్వ నిర్మాణాలు చేయాలంటే ఎంతో ఉత్సాహంగా పోటీ పడేవారు. ఇప్పుడు పిలిచి పనులిస్తామన్నా చేయడానికి ముందుకు ఎవరూ రావడం లేదు. అధికార పార్టీ కార్యకర్తలే కాంట్రాక్టర్లుగా ఉన్నా బిల్లులు వస్తాయన్న నమ్మకం లేక వారు కూడా ఈ కాంట్రాక్టు పనులు చేయడానికి వెనుకాడుతున్నారు.

విఆర్.పురం మండలంలో గ్రామాల్లో అంతర్గత రోడ్లకు దిక్కులేదు సరికదా... కనీసం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల నిర్మాణం కూడా చేయలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. పెదమట్టపల్లి నుండి కుందులూరు మీదుగా నర్సంగపేట వరకు ఉన్న 20 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.4.33 కోట్లు మంజూరు కాగా, మూడేళ్ల క్రితం ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టరు ఈ రోడ్డును తవ్వి వదిలేశారు. కుందులూరు గ్రామానికి ముందు రెండు కిలోమీటర్లు మాత్రం కంకర పోశారు. మూడేళ్లయినా నేటికీ ఈ రహదారి నిర్మాణం చేయలేదు. దీంతో రాళ్లు తేలిపోయి ఈ రహదారిలో ప్రయాణం నరక ప్రాయంగా మారింది. వర్షాలు కురిస్తే మోకాళ్లలోతు బురదలో ఇబ్బంది పడాల్సి వస్తోంది. 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రం విఆర్.పురం వెళ్లాలంటే వాహనాల రాకపోకలు సాగడం లేదు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు, ఆసుపత్రి, బ్యాంకులకు, నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి మండల కేంద్రానికి వెళ్లాలంటే 16 గిరిజన గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అలాగే తెల్లవారిగూడెం నుండి గుల్లేటివాడ వరకు సుమారు 3.2 కిలోమీటర్ల బిటి రోడ్డుకు రూ.159.29 లక్షలు నిధులు మంజూరు కాగా, రెండేళ్ల క్రితం మెటల్ వేసి వదిలేశారు. ఈ రహదారుల నిర్మాణం పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. తక్షణమే ఈ రహదారుల నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

కారంగూడెం బిటి రోడ్డు జంక్షన్ నుండి ఎజి కోడేరు వరకు, జల్లివారిగూడెం నుండి బంగారుగూడెం వరకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వాటిని మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కుందులూరు బిటి రోడ్డు నుండి జల్లివారిగూడెం వరకు, కందులూరు నుండి టేకులూరు వరకు, గొల్లగూడెం నుండి వీరపాపన్నగూడెం వరకు బిటి రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కొన్ని కోట్ల రూపాయలు గిరిజనలకు ఖర్చు పెడుతున్నామని ప్రభుత్వం, అధికారులు చెపుతున్నా, కనీసం చిన్న గ్రామాలకు రహదారులు కూడా వేయలేని దుస్థితి నెలకొంది. ఓట్ల పండుగ దగ్గరకొస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామాలకు రోడ్ల నిర్మాణం చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

తవ్వి వదిలేయడంతో తెల్లంవారి గూడెం వద్ద బురదమయంగా ఉన్న రహదారిపై వరి నాట్లు వేసి నిరసన తెలుపుతున్న ఆ గ్రామస్తులు (ఫైల్‌ఫొటో)

అంబులెన్స్ కూడా రావడం లేదు

ఉన్న రోడ్డును తవ్వేసి, మూడేళ్లగా నిర్మాణం చేయకపోవడంతో రహదారి మొత్తం గోతులు మయంగా మారింది. వాహనాలు రాకపోకలకు వీలుగా రహదారి లేకపోవడంతో మండల కేంద్రానికి వెళ్లాలంటే అనేక అవస్థలు పడుతున్నాం. రోడ్డు బాగోలేక మా గ్రామానికి 108, 104 అంబులెన్స్‌లు కూడా రావడం లేదు. ఇప్పటికైనా మా గోడు ఆలకించండి.

- తెల్లం అప్పారావు, తెల్లంవారిగూడెం

ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు

ఈ రహదారి విషయమై అనేక మార్లు అధికారులను, ప్రజా ప్రతినిధులకు విన్నవించాం. వారిని కలిసి అడిగాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో 16 గ్రామాలు గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు.

- తెల్లం తమ్మయ్య, తెల్లంవారి గూడెం

తక్షణమే నిర్మాణం పూర్తి చేయాలి

రహదారి తవ్వి వదిలేయడంతో వర్షం పడితే బురదమయంగా ఉంటుంది. ఈ రహదారి దుస్థితిని ప్రభుత్వానికి, అధికారులకు తెలియజేయడానికి రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలియజేశాం. అయినా ఎవరిలోనూ చలనం లేదు. ఎన్నేళ్లు ఈ బాధలు పడాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెద్దమట్టపల్లి నుండి తెల్లంవారిగూడెం మీదుగా నర్సింగపేట వరకు రహదారి నిర్మాణం పూర్తి చేయాలి.

- తెల్లం కన్నమ్మ మాజీ సర్పంచ్

ప్రశాంతంగా అర్హత పరీక్ష

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని డిగ్రీ పూర్తి చేసి సివిల్ సర్వీసెస్, గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాల కొరకు ప్రిపేరయ్యే గిరిజన విద్యార్థులకు ఐటిడిఎ ఆధ్వర్యాన 9 నెలల పాటు ఉచిత శిక్షణ నిమిత్తం ఆదివారం నిర్వహించిన మొదటి లెవెల్ అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రంపచోడవరం గురుకుల బాలికల పాఠశాల, కాలేజ్, హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు పరీక్షలు రాశారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్ మాట్లాడుతూ శిక్షణ నిమిత్తం 449 మంది దరఖాస్తు చేసుకోగా, 422 మంది అభ్యర్థులు మొదటి లెవెల్ అర్హత పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. మొత్తం వంద మార్కులకు ఓఎంఆర్ సీటు ద్వారా అభ్యర్థులు పరీక్షలు రాసినట్లు తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగిందని, 35 మంది సిబ్బందితో పగడ్బందీగా నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏటిడబ్ల్యూఓ రామ తులసి, ప్రిన్సిపాల్ జి.ప్రసున్నో, సూపరింటెండెంట్ బి.కిషోర్, యస్.నాగేంద్ర కుమార్, కె.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు, పర్యవేక్షిస్తున్న అధికారులు

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-కొయ్యూరు

పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సోమవారం మండలంలో పర్యటిస్తారని ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు కొయ్యూరు మండలం మర్రివాడ గ్రామంలో వాటర్ ట్యాంక్ ప్రారంభిస్తారని, అనంతరం 11 గంటలకు శరభన్నపాలెం, గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, నిమ్మ గెడ్డ, శరభన్నపాలెంలో డి.పట్టాలు పంపిణీ చేస్తారని ఆయన పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సురేంద్ర, బాల్ దేవ్

ప్రజాశక్తి-యంత్రాంగం

అరకులోయ: రాజ్యాంగాన్ని కాపాడుకుందామని, ఆదివాసీ చట్టాలు, హక్కుల అమలుకు పోరాటం ఉధృతం చేద్దామని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. అరకువేలి దండకారణ్య కళాశాలలో భారత రాజ్యాంగం - ఆదివాసీ హక్కులు, చట్టాలు అంశంపై జరిగిన సదస్సులో కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ, హక్కులు, చట్టాలను బిజెపి, వైసిపి పాలకులు కాలరాస్తున్నారన్నారు. అటవీ చట్టం సవరణ చేసి బడా కార్పొరేట్ కంపెనీలకు అడవులను అప్పగిస్తున్నారని విమర్శించారు. షెడ్యూల్ జిల్లాలో గురుకులం, ఐసిడిఎస్ శాఖల్లో గిరిజనేతరులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలకు నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, మండల నాయకులు కె. మగ్గన్న, కె.బుజ్జిబాబు, కె.రామారావు, ఎస్.ఎఫ్.ఐ నాయకులు ఐసుబాబు, పి.సురేష్, యస్ బాలరాజు, వి.కామరాజు, జే.ప్రసాద్ పాల్గొన్నారు.

అనంతగిరి: మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి స్థానిక జెడ్పీటీసీ దీసరి గంగరాజు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హక్కులు, చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పుడిగి, దేవుడు నరాజీ, సురేష్, కొర్ర శివకృష్ణ పాల్గొన్నారు.

అనంతగిరిలో జెడ్పిటిసి గంగరాజు

పాడేరు: అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని శాసనసభ్యులు కొటగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. పాడేరులో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, పాఠశాల దశ నుంచే రాజ్యాంగ విలువలను పిల్లలకి పెంపొందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సీదరి రాంబాబు, మండల వైస్ ప్రెసిడెంట్ పసుపుల సత్యనారాయణ, గబ్బాడ రాజారావు, జిల్లా పార్టీ కార్యదర్శి సీదరి మంగ్లన్న దొర, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, ఏపిఎంసీ డైరెక్టర్ కొండబాబు, జిల్లా పంచాయతీ కమిటీ అధ్యక్షులు గబ్బాడి చిట్టిబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు సిరగం దశమూర్తి, సర్పంచులు వంతల రాంబాబు, గొల్లోరి నీలకంఠం, వంతల బొంజు బాబు, సోమెలి లక్ష్మణరావు, మాదల రమణమ్మ, జేసీఎస్ కన్వీనర్ పలాసి కోటేశ్వరరావు, ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి, లకే రామకృష్ణ పాత్రుడు, పలాసి రాజేశ్వరి, సచివాలయ కన్వీనర్లు మినుముల కన్నాపాత్రుడు, వంతాల నరేష్ బాబు, లకే రామ సత్యవతి, కొట్టగుల్లి నాగేంద్ర, కొర్ర బాలరాజు, మాదల ప్రసాద్, పాడి సింహాచలం, సీనియర్ నాయకులు సమరెడ్డి ఊర్వశి రాణి, శివరాత్రి నాగేశ్వరరావు, కొట్టగుల్లి కొండాజీ, పాంగి కోటి బాబు, బోనంగి రమణ, రాంబాబు పాల్గొన్నారు.

పాడేరులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేస్తున్న భాగ్యలక్ష్మి

దుంబ్రిగుడ: పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ పి.కొములు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బడుగు, బలహీన, దళిత వర్గాలు

అంబేద్కర్‌కు ఘన నివాళి

అభివృద్ధి చెందడానికి రిజర్వేషన్లు కల్పించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని సర్పంచ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం ట్రెజరరీ బి.విక్రమ్, వైస్ సర్పంచ్ జగన్నాథం, సునీల్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

చింతపల్లి: రాజ్యాంగ దినోత్సవాన్ని చింతపల్లిలో స్థానిక జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య ఘనంగా నిర్వహించారు. చింతపల్లిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ బాధ్యతగల పౌరులుగా మెలగాలని సూచించారు.

పెదబయలు : మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిటపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు బొండ సన్నిబాబు, జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను కాలరాస్తున్నాయన్నారు 1/70 చట్టాన్ని అతిక్రమించి గిరిజనేతరులు అక్రమంగా కట్టడాలు చేపడుతున్నా ప్రభుత్వం కళ్ళకు గంతలు కట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జి.ప్రసాద్, సీఐటీయూ మండల నాయకులు సిహెచ్ రామారావు, గిరిజన సంఘం మండల అధ్యక్షులు బి.గంగాధరం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మారేడుమిల్లి సెంటర్‌లో భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి మారేడుమిల్లి మండల యువత ఆధ్వర్యాన మాజీ ఎంపీటీసీ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ) తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనిల్ ప్రసాద్ మాట్లాడుతూ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని ఒకే తాటిపై నడిపించే రాజ్యాంగం ఆమోదించి 73 ఏళ్లు అయిందని తెలిపారు. ప్రతి ఒక్కరు అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వార్డ్ మెంబర్ లక్కొండ సతీష్ కుమార్, దూడ ప్రణీత్, గడుతూరి కిషోర్ కుమార్, మండల యువత పాల్గొన్నారు.



మారేడుమిల్లిలో పూలమాల వేస్తున్న అనీల్‌ప్రసాద్ తదితరులు

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎమ్ శేఖర్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ఎస్ అప్పనమ్మ, అధ్యాపకులు జి.వెంకట్రావు, కె.శకుంతల, జి.హారతి, కె.శైలజ, కె.శ్రీదేవి, కె.శ్రీలక్ష్మి, సిహెచ్.రాజబాబు, ఆర్.మౌనిక, పి.గౌతమి, జి.సాయికుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

చింతూరు డిగ్రీ కాలేజీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపల్ రత్నమాణిక్యం

రంపచోడవరం : భారత రాజ్యాంగ దినోత్సవం, సాంఘిక శాస్త్ర దినోత్సవాలను స్థానిక కేజీబీవీ పాఠశాలలో హెచ్ఎం సంతోషిని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి కెవివి.సత్యనారాయణ రాజ్యాంగ పీఠిక గురించి వివరించారు. కార్యక్రమంలో సోషల్ ఉపాధ్యాయురాలు సుభాషిని, సిబ్బంది, పాల్గొన్నారు.

రంపచోడవరం కెజిబివిలో....

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని వెదుళ్లపాలెం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బైకిస్టు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. విజయనగరం డిఎస్ఆర్ కాలనీకు చెందిన అంత్యాకుల నవీన్ కుమార్ (26) తునిలో తన స్నేహితుడిని కలిసి శనివారం రాత్రి బైక్ పై తన ఇంటికి బయలుదేరి వెళుతుండగా వెదుళ్లపాలెం జంక్షన్ వద్ద లారీ ఢీకొనడంతో నవీన్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ బాధితుడిని స్థానిక సిహెచ్‌సిలో ప్రథమ చికిత్స అందించి, అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కేజిహెచ్‌కు తరలించగా ఆదివారం మృతి చెందినట్లు హెచ్‌సి వెంకటరావు తెలిపారు.

బట్టల దుకాణం దగ్ధం

ప్రజాశక్తి- తగరపువలస : తగరపువలస మెయిన్ రోడ్డు వద్ద ఉన్న జస్వంత్ ఫ్యాషన్స్ రెడీ మేడ్ బట్టల దుకాణంలో ఆదివారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రూ.లక్షల్లో ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. బట్టల దుకాణం పైఅంతస్తులో ఆ దుకాణ యజమాని కుటుంబసభ్యులు నివాసముంటున్నారు. ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా? ఇంకేమైనా కారణం ఉందా? అన్నది తెలియాల్సి ఉంది. అసలే ఆదివారం సహజంగానే మెయిన్ రోడ్డులో జనం రద్దీగా ఉన్నారు. ఇంతలో అనుకోకుండా ఈ ప్రమాదం జరగడంతో ప్రజలు, సంబంధిత దుకాణం, పక్కనే ఉన్న బట్టల దుకాణ యజమానులు, పనిచేసే కార్మికులు ఒకింత భయాందోళనకు గురయ్యారు. సంఘటనా స్థలానికి ఎక్కువ సంఖ్యలో జనం తరలిరావడంతో పోలీసులు వారిని అదుపుచేయడం కష్టతరంగా మారింది. సమాచారం అందుకున్న చిట్టివలస ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

న్యాయ వ్యవస్థ బలోపేతం కావాలి

ఢిల్లీ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ రేఖాశర్మ

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : రాజ్యాంగ స్వేచ్ఛ పేరుతో జరుగుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి న్యాయ వ్యవస్థ మరింత బలోపేతం కావాలని ఢిల్లీ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ రేఖా శర్మ పేర్కొన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యాన దసపల్లా హోటల్‌లో ఆదివారం 'రాజ్యాంగ విలువలు- ప్రజాస్వామ్య పరిరక్షణ' అంశంపై జరిగిన జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సును ఆమె ప్రారంభించి కీలకోపన్యాసం చేశారు. స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులు, బాధ్యతల నుంచి భారతదేశ రాజ్యాంగ రూపుదిద్దుకుందన్నారు. ప్రతి వ్యక్తీ హక్కులతోపాటు తమ బాధ్యతలను గుర్తెరిగి ప్రవర్తించాలన్నారు. ఒత్తిడి లేని తీర్పులు న్యాయమూర్తుల నిబద్ధతకు గీటురాయిగా నిలుస్తాయన్నారు. న్యాయమూర్తుల నియామకంలో ఎదురవుతున్న సంఘర్షణలు, కొందరు న్యాయమూర్తుల పనితీరు రాజ్యాంగాన్ని ప్రశ్నిస్తున్నట్లు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తులు ఉద్యోగ విరమణ తర్వాత ఎటువంటి పదవులూ నిర్వహించకపోవడం ఉత్తమం అన్నారు. రాజకీయ జోక్యం లేని ఆరోగ్యకరమైన న్యాయ వ్యవస్థ రావాలన్నారు. ప్రజాస్వామ్యానికి పవిత్ర గ్రంథమైన రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి రాజ్యాంగ పరిధిలో నిందితుల హక్కులు అన్న అంశంపై ప్రసంగించారు. మహనీయుల త్యాగఫలంగా రూపొందించిన రాజ్యాంగాన్ని అపహస్యం చేసే సందర్భంగా రాకూడదన్నారు. సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ, ఇటీవల కోర్టుల్లో తీర్పులు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా వస్తున్నాయని అత్యున్నత న్యాయస్థానంలోని అనేక కేసుల పరంపరను వివరిస్తూ వాపోయారు. కొలీజియం వ్యవస్థ స్థానంలో జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్ కమిషన్ ఏర్పాటుచేస్తే కొంతవరకు న్యాయవ్యవస్థ పని తీరు బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. ఆర్బిట్రేషన్ వ్యవస్థ ఒక పెద్ద వ్యాపారంలా తయారైందని అన్నారు. ఈ సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలిపాటి గిరిధర్, పలువురు సీనియర్ జూనియర్ న్యాయమూర్తులు, ఐఎఎల్ ప్రతినిధులు కెఎస్ఎస్.సురేష్‌కుమార్, అజయ్‌కుమార్, విశాఖపట్నం న్యాయవాదుల సంఘం అధ్యక్షులు చింతపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శి పైల శ్రీనివాసరావు, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షులు రామజోగేశ్వరరావు, మెంబర్లు పి.నర్సింగరావు, ఎస్.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

అల్లూరి కాంస్య విగ్రహం వద్ద పూర్వ విద్యార్థులు

జెడ్‌పి హైస్కూల్‌లో అల్లూరి కాంస్య విగ్రహం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోలీస్ స్టేషన్‌పై దాడి చేయడం ద్వారా చరిత్రకెక్కిన రాజవొమ్మంగిలో స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.7లక్షలతో అల్లూరి సీతారామరాజు నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని పాఠశాల పూర్వపు విద్యార్థి ముదునూరి సూర్యనారాయణరాజు తన సొంత నిధులతో ఆదివారం ఏర్పాటు చేశారు. 1966 నుండి 2023 వరకు ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులతో స్వర్ణోత్సవాలు డిసెంబర్ 16, 17 తేదీలలో జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులతో సన్నాహక సమావేశం దంతులూరి శివరామచంద్రరాజు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. తొలిత 1976-77లో ఈ పాఠశాలలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థి ముదునూరు సూర్యనారాయణరాజు తన సొంత నిధులు రూ.7 లక్షలతో సమకూర్చిన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి దంతులూరి శివరామచంద్రరాజు తదితరులు మాట్లాడుతూ అల్లూరి విగ్రహం ఏర్పాటు అభినందనీయమన్నారు. స్వర్ణోత్సవాలు పకడ్బందీ నిర్వహణకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశామని, వీటిలో పూర్వ విద్యార్థులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చీడిపల్లి అప్పారావు, కృష్ణ వర్మ, డి శివాజీ, జీవన్, సూరిబాబు, టి వీర్రాజు, బాబు, వాణి తదితరులు పాల్గొన్నారు.

బిఎంపి వైద్యులు రమణ దంపతులకు డాక్టరేట్లు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండలం జడ్డంగి గ్రామానికి చెందిన బేసిక్ మెడికల్ ప్రాక్టీస్ (బిఎంపి) వైద్యులు బొల్లెం వెంకటరమణ, ఆయన భార్య నాగలక్ష్మికి హోలీ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ డాక్టరేట్లను అందించింది. తెలంగాణా రాష్ట్రం సికింద్రాబాద్ సెయింట్ మేరీ కాలేజ్ వద్ద ఏమ్మెలీ బిల్డింగ్‌లో ఈ నెల 25 తేదీన జరిగిన ఓ కార్యక్రమంలో హోలీ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ అసోసియేషన్ అధినేత బిషఫ్ డాక్టర్ ఆనంద్ కుమార్ చేతులు వెంకటరమణ దంపతులు డాక్టరెట్లు అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తను గిరిజనులకు అందించిన వైద్య సేవలు, స్వచ్ఛంద సేవలకుగాను, తన భార్య నాగలక్ష్మి క్రిస్టియన్ ద్వారా దేవునికి సేవలను గుర్తించి తీయాలాజీ (నీతిశాస్త్రం)లో డాక్టరేట్ ఇచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రమణ దంపతులను పలువురు అభినందించారు.

ఫిబ్రవరి 10, 11 తేదీల్లో రేలా సాంస్కృతిక సమ్మేళనం

ప్రజాశక్తి-చింతూరు : ఆదివాసీ సాంస్కృతిక సమ్మేళనం రేలా పండుగ ఫిబ్రవరి 10, 11 తేదీల్లో చింతూరు నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట కార్యదర్శి పులి వీరయ్య, కారం రవి తెలిపారు. స్థానిక సెల్ఫ్ మేనేజ్మెంట్ హాస్టల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని ఆదివాసీ తెగల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు అలవాట్లు కాపాడేందుకు తమ సంఘం కృషి చేస్తుందని చెప్పారు. అందుబాలో భాగంగానే రేలా పండుగ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం జరగాలని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు న్యాయంగా భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ యవతీ యువకులకు ఉద్యోగ భద్రత కోసం ప్రత్యేకంగా చట్టాన్ని చేయాలన్నారు. కార్యక్రమంలో ఆటా రాష్ట్ర కార్యదర్శి పూసం శ్రీను, ఉద్యోగ సంఘ నాయకులు తిమ్మ సాయి, కణితి గణేష్, సోడి మురళి, మడకం నారాయణ, సంక్షేమ పరిషత్తు నాయకులు సోడి ముత్తయ్య, పైదా ముత్తయ్య, మినప నాగేశ్వరరావు, సరియం రాజ్ కుమార్, సున్నం కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో క్లాక్ టవర్

60 అడుగుల నిర్మాణానికి రూ.2.8 కోట్ల నిధులు కేటాయింపు
జగదాంబ జంక్షన్‌లో సాగుతున్న పనులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఒకప్పుడు ఎల్లమ్మ తోటగా ప్రసిద్ధి చెందిన ప్రదేశమది. 1970లో జగదాంబ థియేటర్ నిర్మాణంతో జగదాంబ జంక్షన్‌గా గుర్తింపునొందింది. తాజాగా ఇక్కడ మరొక అద్భుతమైన నిర్మాణం రూపుదిద్దుకుంటోంది. సరిగ్గా.. జగదాంబ థియేటర్ ఎదురుగా ఉన్న తెన్నేటి విశ్వనాథం విగ్రహం జంక్షన్‌లో రూ.2 కోట్లా 80 లక్షలతో అత్యంత ఆధునిక పద్ధతిలో క్లాక్ టవర్ నిర్మిస్తున్నారు. రెండు మాసాల క్రితం శంకుస్థాపన జరిగిన ఈ క్లాక్ టవర్ నిర్మాణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

జివిఎంసి నగరంలోని 20 జంక్షన్లను, 16 రోడ్లను రూ.25 కోట్లతో అభివృద్ధి చేస్తోంది. అందులో భాగంగా జగదాంబ జంక్షన్‌లో రూ.2.8 కోట్లతో క్లాక్ టవర్ నిర్మిస్తోంది. ఇక్కడ క్లాక్ టవర్‌తో పాటు ల్యాండ్ స్కేటింగ్‌తో కూడిన ఫౌంటెయిన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో, ప్రత్యేకంగా రూపొందించిన బూడిద రంగు ఇటుకలతో క్లాక్ టవర్ నిర్మాణం కానుంది. నాలుగు వైపులా గడియారాలు ఏర్పాటు చేస్తూ 60 అడుగుల ఎత్తులో నిర్మించనున్న క్లాక్ టవర్ జగదాంబ జంక్షన్‌కు మరొక ల్యాండ్ మార్క్ కానుంది. ఇక నగరానికి వస్తే కెజిహెచ్ ప్రవేశం వద్ద ఒక క్లాక్ టవర్ ఉంది. నాడు బ్రిటిష్ వారు లండన్ నుంచి తీసుకువచ్చిన గడియారం ఇక్కడ ఏర్పాటు చేశారు. అలాగే ఆంధ్ర యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం వద్ద క్లాక్ టవర్‌ను జైపూర్ మహారాజు 1926-1932 మధ్య ఏర్పాటు చేశారు. పాత నగరంలోని కురుపాం మార్కెట్ వద్ద కూడా క్లాక్ టవర్ ఉండేది. అయితే దీనిని మున్సిపల్ అధికారులు అప్పట్లో తొలగించారు.

అలాగే ప్రస్తుతం జివిఎంసి పరిధిలో ఉన్న భీమిలిలో డచ్ వారు నిర్మించిన 'భీమిలి టవర్' ఈనాటికీ ల్యాండ్ మార్క్. ఇప్పుడు వీటన్నింటి సరసన జగదాంబ జంక్షన్ క్లాక్ టవర్ చేరనుంది. అయితే వీటన్నింటికీ భిన్నంగా, ఆధునిక హంగులతో, రాత్రిపూట అద్భుతమైన లైటింగ్‌తో కూడిన ఫౌంటెయిన్ విన్యాసాలు ఇక్కడ ప్రత్యేకంగా నిలుస్తాయని జివిఎంసి అధికారులు అంటున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పాలకులు పరిష్కరించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. డిసెంబర్ 8 నుంచి అంగన్‌వాడీలు రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), ఎఐటియుసి, ఐఎఫ్‌టియుల అనుబంధ సంఘాల ఆధ్వర్యాన సమ్మెకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.తులసి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఐసిడిఎస్ పథకానికి తగిన నిధులు కేటాయించకుండా మోడీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం పోషకాహారం సరఫరా చేసే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు సరఫరా చేయడం లేదన్నారు. గడిచిన నాలుగేళ్లుగా ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ వేతనాలు పెంచకపోవడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలన్న తమ డిమాండ్‌ను పట్టించుకోవడం లేదని వాపోయారు. తప్పని పరిస్థితుల్లో పిల్లలు, బాలింతలు, గర్భిణులు, అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మెకు వెళ్తున్నామని తెలిపారు. ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశానికి సమన్వయకర్తలుగా యూనియన్ సీనియర్ నాయకులు కె.బృంద, గౌరవాధ్యక్షులు పి.మణి, జిల్లా కార్యదర్శి ఎల్.దేవి, కోశాధికారి కె.పద్మావతి, కార్యనిర్వాహక అధ్యక్షురాలు ఆర్.శోభారాణి వ్యవహరించారు.

పలు సంఘాల మద్దతు

అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పడాల రమణ, ఎపిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి దేవా, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి లక్ష్మి, సిఎఫ్‌టియుఐ జిల్లా కార్యదర్శి వెంకటలక్ష్మి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, పిఒడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మి, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు మహేష్, నమ్మి రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, మేరీ, ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్యదర్శి ఎ.సీతామాలక్ష్మి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎం.సుబ్బన్న, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

రోలింగ్ ట్రోఫీ విజేత నైన

ప్రజాశక్తి - విశాఖపట్నం : ఎన్‌గ్రేవ్ శ్రీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన డాక్టర్ రొంగలి బాబూరావు స్టేట్ రోలింగ్ ట్రోఫీ చెస్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. 260 మంది క్రీడాకారులు, 50 మంది రేటెడ్ ఆటగాళ్లుపాల్గొన్నారు. విశాఖపట్నానికి చెందిన గొర్లి నైన ప్రథమ స్థానం, వెంకట్ రిత్విక్ ద్వితీయ స్థానం సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన 51వ వార్డు కార్పొరేటర్ రొయ్య వెంకటరమణ విజేతలకు బహుమతులు అందజేశారు. ఇటువంటి క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ సభ్యులు భీమారావు, బాబూరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ట్రోఫీ అందుకుంటున్న నైన

ఎంపీ మాధవికి వినతిపత్రం అందజేస్తున్న సిఆర్‌టిలు

సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలని వినతి

ప్రజాశక్తి- కొయ్యూరు : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న 579 మంది, పాడేరు ఐటిడిఎ పరిధిలో 259 మంది సిఆర్‌టిలు రెగ్యులర్ చేసేందుకు అర్హులుగా ఉన్నారని, వారిని రెగ్యులర్ చేయాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవికి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు ఆదివారం విశాఖలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ మాధవిని మర్యాదపూర్వకంగా కలిసిన వినతిపత్రం అందజేశారు. దీనికి ఎంపీ స్పందిస్తూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

గంజాయి తోటలను దగ్ధం చేస్తున్న పోలీసులు

గంజాయి తోటలు ధ్వంసం

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ ఆకులూరు, ఎర్రగడ్డ గ్రామాల్లో గంజాయి తోట ధ్వంసం ఆదివారం పోలీసులు ధ్వంసం చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. గంజాయి సాగు జోలికి ఎవరు పోవద్దని, అటువంటి కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. అనంతరం జీకే వీధి సిఅశోక్ కుమార్ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గంజాయి సాగు నేరమని అనేక సార్లు అవగాహన కల్పించినా, కొంతమందిలో మార్పు రాకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా గంజాయి సాగుకు స్వస్తి పలకాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో సీలేరు ఎస్ఐ రామకృష్ణ, రెవెన్యూ, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. 150 మంది రోగులుగా రాగా, వారికి డాక్టర్లు దాసరి ఉమమహేష్, తలారి వెంకట సుబ్బారావు, రాయుడు శ్రీనివాస్, సంపత్ కుమార్ వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ శిబిరంలో 51 మందికి రక్తపరీక్షలు, ఏడుగురికి థైరాయిడ్ పరీక్షలు, ఏడుగురికి ఎక్స్ రేలు, నలుగురికి ఫిజియథెరపీ చేసినటు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో క్యాంప్ కో-ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్ గాధిరాజు వెంకటలక్ష్మి పాల్గొన్నారు. రోగులకు, వారి సహాయకులకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు.